బాబోయ్.. దొంగలు..


అశోక్‌నగర్‌లోని ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)


దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో దొంగలు ధ్వంసం చేసిన బంగారు దుకాణం షట్టర్

ఏజెన్సీలో వరుస చోరీలతో అయోమయం

- భద్రాచలం సబ్‌డివిజన్‌లో వరుస చోరీలు
- పోలీసులకు సవాల్‌లా మారిన ఘటనలు
- తాజాగా భద్రాచలంలో మహిళ మెడలో గొలుసు అపహరణ

భద్రాచలంఅర్బన్: అర్ధరాత్రి అయిందంటే చాలు, ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలం నియోజకవర్గంలో దొంగలు రెచ్చిపోతున్నారు. చడీచప్పుడు కాకుండా నగదు, బంగారాన్ని చోరీ చేస్తున్నారు. ఇళ్లు, దుకాణాలు ఇలా ఏదైనా సరే, అందినకాడికి దోచుకుంటున్నారు. గత బుధవారం భద్రాచలం పట్టణంలోని వాటర్ బాటిల్ కొనుగోలు చేసేందుకు వచ్చి దుకాణం నిర్వాహకురాలి మేడలో రెండు చైన్లు దొంగలించారు. కాగా నియోజవర్గ పరిధిలోని దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఇటీవల జరుగుతున్న వరుస చోరీలతో స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. సీసీ కెమెరాలున్నాయన్న భయం లేదు. పట్టుబడుతామన్న బెరుకు లేదు. దొంగలు యధేచ్ఛగా అందినకాడికి ఎత్తుకెళుతున్నారు.

సీసీ కెమెరాలున్నా...

పోలీసుల సూచనలతో భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలో చాలాచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా కూడళ్ల, కాలనీల్లో, దుకాణాలు, ఇళ్ల, ఆలయాలు.. ఇలా వీలైన చోట్ల కెమెరాలతో నిఘా ఉంటోంది. పైపెచ్చు భద్రాచలం అంతా ఏజన్సీ ప్రాంతం కావడం నిత్యం పోలీసుల పెట్రోలింగ్ జరుగుతోంది. అయినా దొంగలు భయపడటం లేదు. ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలు పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతోంది. ఏ మాత్రం బెరుకులేకుండా తాళాలను పగులగొట్టి, లోపలకు చొరబడుతున్నారు. నగదు, విలువైన వస్తువులు ఏవి లభిస్తే వాటిని చేజిక్కించుకొని పారిపోతున్నారు. అయితే.. చోరీలన్నీ అర్ధరాత్రి వేళల్లో, జనసంచారం తక్కువగా ఉన్న సమయంలో కానిచ్చేస్తున్నారు.

ఇటీవల జరిగిన చోరీ ఘటనలు..

➡ జనవరిలో భద్రాచలం పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో గల సారథి రమేష్ ఇంట్లో దొంగలు పడగా రూ.2 లక్షల నగదు తో పాటు 19 గ్రాముల బంగారం చోరీకి గురైంది.

➡ ఫిబ్రవరి 17న మూడు చోట్ల..
ఫిబ్రవరి 17 రాత్రి దుమ్ముగూడెం మండల పరిధిలో గల లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న ఝాన్సీ జ్యుయలరీ దుకాణంలో దొంగలు చోరీకి యత్నిస్తుండగా అద్దెకు ఉన్న వ్యక్తులు నిద్రలేవడంతో వారు పరారయ్యారు.
● ఆదేరోజు చర్ల మండలకేంద్రంలో బంగారు దుకాణంలో దొంగలు 3 కిలోల వెండి, బంగారు వస్తువులు, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు.
● అదే రోజు దుమ్ముగూడెం మండల పరిధిలో రేగుబల్లి గ్రామానికి చెందిన సులేమాన్ ఇంట్లో దొంగలు పడి రూ.47 వేలు నగదు, 11.5 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి చోరీకి గురయ్యాయి.

➡ ఫిబ్రవరి 18న చర్ల మండల పరిధిలోని సత్యనారాయణపురంలో రాము అనే వ్యక్తి చెందిన ఇంట్లో దొంగలు పడ్డారు.

➡ ఫిబ్రవరి 19న భద్రాచలం పట్టణంలోని ఇందిరా మార్కెట్ లో ఉన్న ఓ దుకాణంలో వాటర్ బాటిల్ కొనుగోలు చేసేందుకు వచ్చి దుకాణం నిర్వాహకురాలి మేడలో ఉన్న రూ.6 లక్షల విలువైన రెండు బంగారపు చైన్లను దొంగలు లాక్కొని వెళ్లారు.

పోలీసుల సూచనలు...

→ అవసర నిమిత్తం ఇళ్లు విడిచి వెళ్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
→ కాలనీల్లో మొదటి ప్రాధాన్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
→ అపరిచిత వ్యక్తులు పూర్తి వివరాలను తెలుసుకొని ఇళ్లు అద్దెకు ఇవ్వాలి.
→ అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి.
→ ఇంట్లో ఉన్న విలువైన బంగారం నగలు, నగదును బ్యాంకులో భద్రపర్చుకోవాలి.
→ చోరీలను అరికట్టేందుకు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి.

సమాచారం ఇవ్వండి..



అనుమానితులు సంచరిస్తే వెంటనే డయల్ 100 , పోలీసులకు సమాచారం ఇవ్వండి. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లే చుట్టూ పక్కల వారికి చెప్పి వెళ్లండి. విలువైన నగదు, బంగారం ఇంట్లో పెట్టి బయటకు వెళ్లొద్దు. ఏజన్సీ ప్రాంతం అయిన భద్రాచలంతో పాటు చర్ల, దుమ్ముగూడెం లో నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. సీసీ కెమెరాలతో భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయి కాబట్టి సీసీలు ఏర్పాటు చేసుకోవాలి.

– విక్రాంత్ కుమార్ సింగ్, అసిస్టెంట్ ఎస్పీ, భద్రాచలం

క్లుప్తంగా

పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలి

అశ్వాపురం: రైతులకు నిత్యం అందుబాటులో ఉండే మండల వ్యవసాయ అధికారి సాయిశంతన్‌కుమార్‌ను కొందరు కక్షపూరితంగా ఏసీబీకి పట్టించారని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లలో అవినీతిపై విచారణ చేయకుండా ఏఓను బాధ్యుడిగా చేయడం సరికాదని తెలిపారు. దళారులకు సహకరించకపోవడంతోనే ఆయనను ఏసీబీకి పట్టించినట్లు అనుమానాలు ఉన్నందున అధికారులు పూర్తిస్థాయిలో విచారించాలని కోరారు. ఈమేరకు శుక్రవారం వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం నాయకులు, ప్రజాప్రతినిధులు ఓరుగంటి భిక్షమయ్య, ఓరుగంటి రమేష్, గాదె కేశవరెడ్డి, అనంతనేని సురేష్, కమటం వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు మండెపూడి సాంబశివరావు, బద్దం శంభిరెడ్డి, అశోక్‌రెడ్డి, తూము వెంకన్న, స్వర్గం రాఘవులు, పినికేసి సుధాకర్‌రెడ్డి, సింగం సత్యనారాయణ, వెంకన్న మాట్లాడారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


పనులు పరిశీలిస్తున్న డీఈ, ఏఈ

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువులో లోతువాగుపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్ అండ్‌బీ డీఈ హరిలాల్ అన్నారు. తుమ్మలచెరువులో లోతువాగుపై వంతెన పనులను శుక్రవారం డీఈ తనిఖీ చేశారు. పనుల పురోగతిని పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగవంతంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ తెల్లాకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి

మణుగూరు టౌన్: పీవీకాలని ఏరియాలో ఆకతాయిల ఆగడాలపై దృష్టి సారించి అరికట్టాలని, కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఓటూ జీఎం శ్యాం సుందర్‌కి వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో ముఖాలకు మాస్కులు ధరించి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రాత్రి షిఫ్ట్ కార్మికులు కుటుంబాలను వదిలి విధులకు హాజరుకావాలంటేనే మానసికంగా ఆందోళనకు గురవుతున్నారన్నారు. కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తూ పార్కింగ్ చేసిన వాహనాలను ధ్వంసం చేస్తున్నారని, భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. బంగారి పవన్‌కుమార్, మస్తాన్, రమేశ్, మునిగెల నాగేశ్వరరావు, ప్రవీణ్, బత్తుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: మండలంలోని పెద్ద ఆర్లగూడెంలో విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ శుక్రవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. నాయకులు లంకా శ్రీనివాసరావు, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షులు పిలక వెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తెలం హరికృష్ణ, నాయకులు మట్టా శివాజీ, కుంజ శ్రీనివాస్, శివకుమార్, వెంకన్నరాజు, సాగర్, బాలాజీ, సుబ్బారావు ఉన్నారు.

ప్రజాస్వామిక శక్తులన్నీ ఏకం కావాలి

దుమ్ముగూడెం: దేశంలో బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా లౌకికతత్వ ప్రజాస్వామిక శక్తులన్నీ ఏకం కావాలని, వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయ దిశగా అడుగులు వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ములకపాడు సెంటర్‌లోని యలమంచి సీతారామయ్య భవనంలో రెడ్ బుక్ డే కార్యక్రమంలో మాట్లాడారు. మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, మచ్చా రామారావు, దొడ్డి హరినాథవర్మ, మర్మం సమ్మక్క, ఈసన్నపల్లి మల్లారం ముర్రం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: సీపీఎం మండల కార్యదర్శుల సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. జాతీయ స్థాయిలో పార్టీ చేసిన తీర్మానాలపై నాయకులు చర్చించారు. కొక్కెరపాటి పుల్లయ్య, నాయకులు యంద్రాతి అప్పారావు, పిట్టల అర్జున్, కేశవరావు, మోరంపూడి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాతృభాషను కాపాడుకోవాలి


అశ్వారావుపేటరూరల్ : డిగ్రీ కళాశాలలో..


ములకలపల్లిలో..

అశ్వారావుపేటరూరల్ : ప్రతి ఒక్కరూ మాతృభాషను కాపాడుకోవాలని, మాతృభాష గొప్పతనాన్ని చాటాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన, అశ్వారావుపేట జెడ్పీఎస్ఎస్ హెచ్ఎం హరిత అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలో తెలంగాణ గిరిజన బాలికల డిగ్రీ కళాశాల, అశ్వారావుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కో ఆర్డినేటర్ ఎమ్.ఉమా, గోపాల్, సరిత, అరుణ, సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రముఖ రచనలతో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. చిన్నారులు దేశనాయకులు, కవులు, కవయిత్రుల వేషధారణలో అలరించారు. ఇన్‌చార్జి హెచ్ఎం భావ్‌సింగ్, అధ్యాపక బృందం కుమారి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, రమేష్‌బాబులు మాట్లాడగా మాగంటి సాయి సూర్య, తులసీదాసు, బాలాజీ, వేణు, శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

మణుగూరు టౌన్: పీవీకాలనీలో కొలువై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మార్చి 1 నుంచి 4 వరకు జరిగే బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని పీకేఓసీ పీఓ, ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్ కోరారు. శుక్రవారం కొండాపురం భూగర్భగనిలో బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఆర్థిక సహకారం ప్రచార కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్ఓఎం పీ.నర్సింహారావు, మధుబాబు, లింబాబు, వత్సవాయి కృష్ణంరాజు, రామకృష్ణ, వెంకట్, శ్రీనివాస్, నాజర్‌పాషా, నరేశ్, అరుణ్‌తేజ, సర్వేయర్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

దైవారాధనతో ప్రశాంతత

ములకలపల్లి: ప్రతీ ఒక్కరు దైవారాధన అలవర్చుకోవాలని, దానితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని జామాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) జిల్లా మహిళా అధ్యక్షురాలు పర్వీన్ ముస్తాఫా, రామవరం అధ్యక్షురాలు అబ్దుల్ బాసిత్ అన్నారు. రంజాన్ పర్వదినం రానున్న నేపథ్యంలో మండలపరిధిలోని జగన్నాథపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయికి చేర్చే మహత్తు ఉపవాసాలకు ఉందన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ యజ్దానీ, ఉపాధ్యక్షుడు షరీఫ్, ఇర్ఫాన్, అలీ, అబ్దుల్, జబ్బార్, బాజీబాబా పాల్గొన్నారు.

ఇసుక తీసుకునేందుకు అనుమతినివ్వాలి

చర్ల: స్థానికులకు నిర్మాణరంగానికి అవసరమైన ఇసుకను స్థానికంగా ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి తీసుకునేందుకు అనుమతినివ్వాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చర్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కార్యదర్శి నూపా పోతయ్య, పాలంచ రామారావు, నానిపల్లి భద్రం, కోడిరెక్కల రాజారావు, నాగరాజు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకట్రావు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే 'బాలమేళా'


గుండాలలో..


దమ్మపేటలో..

గుండాల/దమ్మపేట: విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలమేళా ఉపయోగపడుతుందని గుండాల, దమ్మపేట ఎంఈఓలు పార్వతమ్మ, కీసర లక్ష్మి అన్నారు. ఈ మేరకు మండలాల స్థాయి బాలమేళా కార్యక్రమం వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దమ్మపేట: మండలంలోని మల్కారం, అంకంపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని 33 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సబ్‌స్టేషన్ల పరిధిలోని త్రీ ఫేజ్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

క్షయపై అవగాహన

చంద్రుగొండ : క్షయవ్యాధి నిర్మూలనపై మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ బృహత్తర కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని డాక్టర్ తనూజ అన్నారు.

క్రికెట్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న ధర్మా తదితరులు

ములకలపల్లి: పూసుగూడెం జీపీలోని ఒడ్డు రామవరం గ్రామంలో పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు భూక్యా ధర్మ, బాణోతు ప్రసాద్ సహకారంలో పోటీలను ఏర్పాటు చేయగా మొత్తం 10 జట్లు పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాయకులు నునావత్ రమేశ్, బొర్రా సుధాకర్, కొర్సా దుర్గారావు, నునావత్ వీరన్న, ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు బోడా అవినాశ్, లావుడ్యా సురేశ్, రమేశ్, గుగులోత్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు స్థానిక తహసీల్‌లో వివిధ శాఖాధికారులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఎంపీడీఓ మహాలక్ష్మి, డీటీ జగదీశ్వర్, ఎంపీఓ షబ్బం, ఏఈ సాయి తరుణ్, ఆర్ఐ మధు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పనులు చేస్తేనే వేతనం


పనులు తనిఖీ చేస్తున్న అదనపు డీఆర్‌డీఓ రవి

అశ్వారావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద పనులు చేసే కూలీలు, ఈ పథకం నిబంధనల ప్రకారం పనులు చేస్తేనే కనీస వేతనం అందుతుందని జిల్లా అదనపు డీఆర్‌డీఓ నల్లబోతుల రవి సూచించారు. శుక్రవారం మండలంలోని మల్లాయిగూడెం, పండువారిగూడెం, ఊట్లపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులను, కూలీల హాజరు తనిఖీ చేశారు. అదే విధంగా ఊట్లపల్లి పంచాయతీ నర్సరీను సందర్శించి మొక్కల నాణ్యత, నర్సరీ నిర్వహణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో నాణ్యమైన మొక్కల్ని పెంచాలని, కలుపు లేకుండా చూడాలని, మొక్కలకు సకాలంలో తెగుళ్ల నివారణ మందులను స్ప్రేయింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు, కార్యదర్శి శ్రీకాంత్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

ఆలయాల వద్ద పటిష్టమైన బందోబస్తు


మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

దమ్మపేట: శివరాత్రి పర్వదినాన శివాలయాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులో వెంచేసియున్న శ్రీ దుర్గమల్లేశ్వర స్వామి ఆలయాన్ని పాల్వంచ డీఎస్పీ, స్థానిక ఎస్సై సాయికిషోర్ రెడ్డితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శివరాత్రి రోజున ఎక్కువగా భక్తుల తాకిడి గల శైవ ఆలయాలను గుర్తించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా తగు చర్యలను తీసుకోవాలని సూచించారు. భక్తుల రద్దీకి తగినట్టుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని చైర్మన్ రావు గంగాధరరావుకు సూచించారు.

'కార్పొరేట్లకు దోచిపెట్టడానికే బడ్జెట్'


మాట్లాడుతున్న డాక్టర్ పాపారావు

భద్రాచలంఅర్బన్: జీఎస్టీ పేరుతో ప్రజల సంపదను కొల్లగొట్టి కార్పొరేట్లకు దోచిపెట్టే పద్ధతిలో కేంద్ర బడ్జెట్ ఉందని ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పాపారావు అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి అధ్యక్షతన పార్టీ స్థానిక కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ విధానాలు కారణంగా పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయిందని, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్ల మంది వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టంకు నిధులు కోత విధించడం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుందన్నారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం స్వామి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు నాదెళ్ల లీలావతి, జీఎస్ శంకర్‌రావు, బీబీజీ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

నియామకంపై హర్షం


మాట్లాడుతున్న నాయకులు

చర్ల: జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షులుగా చర్లకు చెందిన తోటమళ్ల రమణమూర్తి నియామకంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం చర్లలో మండల అధ్యక్షుడు తోటమళ్ల గోపాలరావుతో పాటు తడికల లాలయ్య మాట్లాడుతూ రమణమూర్తి నియామకంతో జిల్లాలో జాతీయ మాలమహానాడు మరింత బలోపేతమవుతుందని తెలిపారు. నాయకులు బోళ్ల వినోద్‌కుమార్, తోటమళ్ల విజయరావు, దొడ్డి వెంకటేశ్వర్లు, చింతల నాగేంద్ర, మంచాల చంటి పాల్గొన్నారు

మిర్చికి మద్దతు ధర చెల్లించాలి


పంటను పరిశీలిస్తున్న నాయకులు

చంద్రుగొండ: మిర్చి పంటకు మద్దతు ధర ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి పెద్దిని వేణు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. మిర్చిపంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. క్వింటాకు రూ. 25 వేలు గిట్టుబాట ధర కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, చల్లపల్లి రాజా పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని గోదావరి కరకట్ట సమీపంలోని శ్రీ సీతారామ కమ్మవారి సేవాసమితి భవన్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 24 వరకు నెల రోజుల పాటు ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు శిక్షకులు గురుజీ నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి 14 సంవత్సరాలు నిండిన వారందరు అర్హులని పేర్కొన్నారు. ప్రతీ రోజు ఉదయ 5.30 నుంచి 6.30 వరకు సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల వారు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటోలకు స్టిక్కర్లు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఆటోల గుర్తింపు కోసం ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్టిక్కర్లను అందజేశారు. ఈ మేరకు పట్టణ సీఐ రమేష ఆధ్వర్యంలో పట్టణంలోని 1,500 ఆటోలకు స్టిక్కర్లను అందజేశారు. ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్, నాయకులు, ఆటో ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండలంలోని ఆటోలకు డిజిటలైజేషన్ చేసిన సమాచార స్టిక్కర్లను సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో అంటించారు. ఎస్సై షేక్ సైదారవూఫ్, పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మోతెగడ్డ ఆలయానికి మరమ్మతులు చేపట్టాలి


ఆలయాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

బూర్గంపాడు: గోదావరి వరదలతో కోతకు గురైన మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని పరుశురాం పరివార్ హిందూ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ కోరారు. శుక్రవారం పరుశురాం పరివార్ ప్రతినిధి బృందం మోతెగడ్డ ఆలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి కిందభాగంలో కోతకు గురైన ప్రాంతంలో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి రక్షణ గోడను నిర్మించాలన్నారు. ఆలయాలను పరిరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. సంస్థ ప్రతినిధులు దేవులపల్లి సాయికిరణ్ శర్మ, కరకు ప్రసాద్, సూరేపల్లి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి అవకాశం ఇవ్వండి

అశ్వారావుపేటరూరల్: బీజేపీ చేసిన పోరాటాలను గుర్తుంచుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం అశ్వారావుపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఆంక్షలు, అడ్డంకులు సృష్టించిన ఉద్యోగ, టీచర్ల కోసం గొంతెత్తామన్నారు. ఈ సమావేశంలో గొట్టుపూళ్ల శ్రీనివాస్, పుష్కర్ కుమార్, మండలాల అధ్యక్షులు బండారు చంద్రశేఖర్, ప్రశాంత్, శంకర్, రఘుపతిరావు, రమేష్ ఉన్నారు.

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవం


ప్రతిష్ఠించిన మహాశివుడి విగ్రహం

మణుగూరు రూరల్: మండలంలోని కట్టుమల్లారం పంచాయితీ పరిధి గన్నెబోయిన గుంపులో శివలింగం, అఖండదీప ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశివశక్తి మహాపీఠం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కాశీవిశ్వనాథ్ గురూజీ ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే వేదపండితులు కాలేవల్లి భాస్కర్ శర్మ, నరేష్‌కుమార్‌శర్మల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్ట్ సభ్యులు మూల చిన్న ఆదిరెడ్డి, కట్కోజుల శ్రీనివాసచారి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.